క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ చైర్స్ వితరణ



పొదలకూరు: మండలంలోని నావూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు నావూరుపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పసుపులేటి ప్రసాద్ శనివారం స్టడీ చైర్స్, ప్యాడ్స్ అందజేశారు. రూ.25 వేలు విలువైన సామగ్రిని విద్యార్థులకు అందజేసినట్లు హెచ్‌ఎం మురళి తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు సీహెచ్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల నమోదు 90 శాతం పూర్తి

పొదలకూరు: మండలంలో పంటల నమోదు కార్యక్రమాన్ని 90 శాతం పూర్తి చేశామని, మరో 2 వేల ఎకరాల్లో పంటలను నమోదు చేస్తే నూరుశాతం పూర్తవుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.వాసు తెలిపారు. శనివారం ఏఓ మాట్లాడుతూ మండలంలో 14 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు తెలిపారు. 12 వేల ఎకరాల్లో రబీ సీజన్లో వరి పంట సాగవుతుండగా, 1,500 ఎకరాల్లో పత్తి, మిగిలిన 500 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నట్లు తెలిపారు. రైతులు పూర్తిగా వరి సాగుపైనే ఆధారపడకుండా ఇప్పుడిప్పుడే పంటల మార్పిడికి అలవాటు పడుతున్నట్లు తెలిపారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకుంటే దిగుబడిని గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం కలుగుతుందన్నారు.

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అలాగే సాయంత్రం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

ఆప్కో చైర్మన్‌కు అభినందన



ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని అభినందిస్తున్న ఐక్యవేదిక నాయకులు

పొదలకూరు: ఆప్కో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గంజి చిరంజీవిని పొదలకూరుకు చెందిన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూకోటి లక్ష్మీనారాయణ తదితరులు విజయవాడలోని కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ శనివారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బీసీలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకుడు పముజుల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

యాభై వేల పనిదినాలు కల్పించడమే లక్ష్యం



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న ఏపీడీ శ్రీహరిరెడ్డి

మనుబోలు: వచ్చే మార్చి లోపు ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని కూలీలకు 50 వేల పనిదినాలు కల్పించడమే లక్ష్యమని డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం టీఏలు, ఎఫ్‌ఏలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టే ముందు రైతులు, గ్రామస్తులతో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. గ్రామసభల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఓ రాజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయండి



బుచ్చిరెడ్డిపాళెం: అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మెప్మా పీడీ రవీంద్ర



వెంకటాచలం : ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

- మెప్మా పీడీ రవీంద్ర
- జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోభివృద్ధిపై అధికారుల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని మెప్మా పీడీ రవీంద్ర సూచించారు. నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణశాఖ అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో నిర్మించిన ఇళ్లను ఉగాది రోజు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం అర్బన్‌లో 230 ఇళ్లు, రూరల్‌లో 250 ఇళ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు చొరవ చూపాలన్నారు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అర్బన్‌లో నత్తనడకన సాగుతున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్ అందుబాటులో ఉందని, ప్రతి రోజూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణశాఖ అధికారులు ఇళ్ల నిర్మాణాలపై పర్యవేక్షణ ఉంచి పూర్తి చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, గృహనిర్మాణశాఖ ఏఈ గౌస్‌మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి

వెంకటాచలం: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. మండలంలోని కంటేపల్లిలో ఉన్న జగనన్న లేఅవుట్లను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఉన్న రెండు లేఅవుట్లు, ఎస్సీకాలనీ వద్ద నిర్మించిన మరో లేఅవుట్‌ను తహసీల్దార్ పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ఎంత మంది ప్రారంభించారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలిబోయిన వెంకటేశ్వర్లు, రమేష్, తుపాకుల కిరణ్ కుమార్, దొడ్డక శ్రావణ్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది లోపు పూర్తి చేయించాలి

ఉగాది లోపు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించి, గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని మండల ప్రత్యేకాధికారిణి ఉషారాణి అధికారులకు సూచించారు. మండలంలోని గుడ్లూరువారిపాళెం, పూడిపర్తి, నిడిగుంటపాళెం గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. లేఅవుట్ల వారీగా వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేస్తుందన్నారు. అలాగే బిల్లులను వెంటనే చెల్లిస్తూ త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి, ఉగాది లోపు అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆమె వెంట గృహనిర్మాణ, విద్యుత్ శాఖల ఏఈలు సీహెచ్ వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్ ఉన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కీలకం

కొడవలూరు: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించడంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని మండల ప్రత్యేకాధికారిణి పి.సత్యవాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాది నాటికి మండలంలో 253 గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించడం లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే వరుసగా మూడు రోజులపాటు ఎలాంటి బిల్లు పెట్టని ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకొనేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు బిల్లులు పెట్టాలని తెలిపారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహిస్తున్నందున, తాను స్వయంగా లేఅవుట్లలో పురోభివృద్ధిని పరిశీలిస్తున్నానని, ప్రతి ఇంజినీరింగ్ అసిస్టెంట్ విధిగా పురోభివృద్ధి చూపాలని తెలిపారు. తొలుత ఆమె మండలంలోని నాయుడుపాళెం జగనన్న లేఅవుట్‌ను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. రూఫ్ లెవల్, బేస్‌మెంట్ల పూర్తయిన వారు ఉగాది కల్లా గృహ ప్రవేశాలకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, డీఈఓ సునీత పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: ముదివర్తిపాళెంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

గృహాలను వేగవంతంగా నిర్మించాలి

ఇందుకూరుపేట: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతంగా నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ముదివర్తిపాళెంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ కల్పన, గృహనిర్మాణశాఖ ఏఈ వెంకటేశ్వరెడ్డితో గృహ నిర్మాణాలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలిచ్చారు.

ట్యాబ్‌ల వినియోగంతో విద్యార్థులకు ప్రయోజనం

- ఆర్జేడీ సుబ్బారావు



పద్మనాభసత్రం పాఠశాలలో ఎంఈఓ, హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న ఆర్జేడీ సుబ్బారావు

కొడవలూరు: విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను వినియోగించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆర్జేడీ సుబ్బారావు పేర్కొన్నారు. మండలంలోని పద్మనాభసత్రం ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఎలా వినియోగిస్తున్నారని అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందజేశారు.. ట్యాబ్‌లన్నీ ఆన్‌లైన్ చేయడం ద్వారా ఏ విద్యార్థి ఎంతసేపు ట్యాబ్ వినియోగిస్తున్నారో తెలుసుకొనే వెసులుబాటు ఉన్నందున అందర్నీ ఆన్‌లైన్ చేశారా అని ఎంఈఓ వసంత కుమారిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వివరాలను ఆన్‌లైన్ చేయడం పూర్తయిందని ఎంఈఓ ఆర్జేడీకి తెలిపారు. ట్యాబ్‌ల వినియోగం వల్ల విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందుతాయని, ప్రతి విద్యార్థి ట్యాబ్‌ను వినియోగించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనని తెలిపారు. ఏ విద్యార్థి అయినా ట్యాబ్‌ను వినియోగించకపోతే అందుకు హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆర్జేడీ వెంట హెచ్‌ఎం మణి కందరాచారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలకు 'పురోగామి'



పదో తరగతి విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

- విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సూచనలిస్తున్న ఉపాధ్యాయులు
- పదో తరగతి పరీక్షలకు సమాయత్తం

ముత్తుకూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు సూచనల మేరకు 'పురోగామి' పేరుతో ఆ శాఖ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నేరుగా పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇంటి పరిస్థితులను స్వయంగా పరిశీలించడం, చదువు పట్ల విద్యార్థులను ప్రోత్సహించడం, తల్లిదండ్రులతో మాట్లాడడం, ఇతర వ్యాపకాలపై దృష్టి మరలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు.

ఆరు జెడ్పీ హైస్కూళ్ల పరిధిలో..

త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలు విడిచిపెట్టిన తర్వాత ఉపాధ్యాయులు సరాసరి విద్యార్థి ఇంటికి వెళ్లే కార్యక్రమం చేపట్టారు. ముత్తుకూరు మండలంలోని 6 జెడ్పీ హైస్కూళ్ల పరిధిలో 'పురోగామి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు పదో తరగతికి సంబంధించి చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌ల ద్వారా స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి చదువుకొనే వాతావరణం ఉందా.. లేదా అని విచారిస్తున్నారు. ఏ సబ్జెక్ట్‌లో విద్యార్థులు వెనుకపడ్డారో తెలుసుకొని, దానిపై ఇష్టం కలిగే విధంగా ప్రోత్సాహం, అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలపై తగు శ్రద్ధ చూపించవలసిందిగా తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ప్రతి రోజూ సంబంధిత హైస్కూల్ పరిధిలోని పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లడం ఒక పనిగా పెట్టుకున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది.

ఉత్తమ ఫలితాల కోసమే..



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకే 'పురోగామి' కార్యక్రమం అమలు చేస్తున్నాం. టెంత్ స్టూడెంట్స్ విజిట్ పేరుతో విద్యార్థుల ఇళ్లకు వెళుతున్నాం. వారు ఎలా చదువుతున్నారో పరిశీలిస్తున్నాం. అవసరమైన సూచనలిస్తున్నాం.

– మధుసూదన్, ఎంఈఓ

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా మండలంలోని జొన్నవాడ వద్ద ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ మల్లి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు గూడూరుకు చెందిన ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు శనివారం 10 కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయుడు కాంతారావు, రాధయ్య, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పోస్టు భర్తీకి చర్యలు

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఫిజికల్ సైన్స్ పోస్టును భర్తీ చేసేందుకు గానూ ఏపీ డీఎస్సీ – 2018 నోటిఫికేషన్ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ కామేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన, డెమోను మంగళవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు ఆటోనగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలకు రావాలని కోరారు. ఎంపికైన వారు 8 నుంచి 10వ తరగతి వరకు బోధించాల్సి ఉంటుందన్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి కోరారు. అయ్యప్పగుడి సమీపంలోని ఐఐటీటీఎం స్కిల్ కాలేజీలో డీఆర్డీఏ – సీడాప్, ఏపీఎస్సెస్డీసీ, జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. అక్కడి సదుపాయాలు, వసతిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. టూర్ మేనేజర్, ఫెసిలిటీ మేనేజర్, మీటింగ్ కాన్ఫరెన్స్, ఈవెంట్ ప్లానర్, తదితర రంగాల్లో ప్రస్తుతం శిక్షణ జరుగుతోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నూరు శాతం ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి



మంగమ్మకు ఎయిర్ కూలర్ అందజేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): గ్యాస్ సిలిండర్ వినియోగించేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని ఎల్‌పీజీ హెచ్‌పీసీఎల్ డీజీఎం అశ్వనికుమార్ అగర్వాల్ అన్నారు. విడవలూరులోని ఎల్‌పీజీ గ్యాస్ గోదామును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పీ గ్యాస్ సంస్థ వారు ప్రవేశపెట్టిన గృహమిత్ర పథకం ద్వారా గ్యాస్ పైపు మార్చుకున్నా, లేదా రెండు సిలిండర్లు తీసుకున్న వారికి ఒక స్క్రాచ్ కార్డు ఇస్తారని, విడవలూరు హెచ్‌పీ గ్యాస్ వినియోగదారు నర్రా మంగమ్మ స్క్రాచ్ కార్డు పొందడంతోపాటు 5వ బహుమతిగా ఎయిర్ కూలర్‌ను సొంతం చేసుకుందని తెలిపారు. ముఖ్యంగా 5 సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా గ్యాస్‌పైపును మార్చుకోవాలని సూచించారు. అనంతరం మంగమ్మకు ఎయిర్ కూలర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సేల్స్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, ఏజెన్సీ నిర్వాహకురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణే ఉపాధి హామీ లక్ష్యం

తోటపల్లిగూడూరు: కూలీల వలసలను నివారించి వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ హేమలత తెలిపారు. మండలంలోని చిన్నచెరుకూరు, పేడూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆమె పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. పనులు కావాలని అడిగిన వారందరికీ ఈ పథకం ద్వారా పనులు చూపిస్తున్నామని తెలిపారు. అంతేకాక కూలీలకు పనిదినాలతోపాటు కనీస వేతనాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పనులు, వేతనాల విషయంలో కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ పథకం అమలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు ఉన్నా తమ దృష్టి తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఉపాధి హామీ పథకం టీఏ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర స్థాయి సహాయకులు ఉన్నారు.

విద్యార్థుల్లో అంతర్గత ప్రతిభ వెలికితీత



నో బ్యాగ్ డేలో భాగంగా చిత్రాలను రూపొందిస్తున్న విద్యార్థులు

కొడవలూరు: పాఠశాలల్లో నో బ్యాగ్ డే నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను వెలికితీయవచ్చని హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ కృత్యాలు చేయించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం, గుణాత్మక విద్య పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం ప్రతి పాఠశాలలో ప్రతి నెలా ఒకటి, మూడు శనివారాల్లో నో బ్యాగ్ డే నిర్వహించాలని అకడమిక్ కేలండర్‌లో సూచించిందని, ఈ మేరకు నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సరసమ్మకు చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీదేవి

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని 20వ వార్డు రామచంద్రాపురానికి చెందిన పేరం సరసమ్మకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును కౌన్సిలర్ శ్రీదేవి శనివారం అందజేశారు. సరసమ్మ కాలు శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఈ విషయాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం సహాయనిధి ద్వారా దాదాపు రూ.60 వేలు మంజూరు చేయించినట్లు కౌన్సిలర్ శ్రీదేవి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వరికి అగ్గి తెగులు బెడద



నరుకూరు వద్ద అగ్గి తెగులు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

తోటపల్లిగూడూరు: మండలంలో రబీ సీజన్‌లో సాగులో ఉన్న వరి పంటకు అగ్గితెగులు ఆశించడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోడూరు, వరిగొండ, మాచర్లవారిపాళెం కాలువల ఆయకట్టు పరిధిలో 22 వేల ఎకరాల్లో ప్రస్తుతం మొదటి పంట(రబీ) సాగులో ఉంది. ఈ మొదటి పంటకు సంబంధించి అధిక శాతం రైతులు నెల్లూరు పెద్ద జిలకర రకం సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పైరు లేత పొట్ట, వెన్నుదశలో ఉంది. కాగా ప్రస్తుతం పగలు ఎండ, రాత్రి మంచు వంటి విపత్కర పరిస్థితులు మండలంలో కొనసాగుతున్నాయి. ఉదయం పూట మంచు ప్రభావం అధికంగా ఉండడంతో వరికి తెగుళ్ల బెడద అధికమైంది. ముఖ్యంగా మండలంలో సాగులో ఉన్న వరి పంటకు అగ్గితెగులు ఆశించింది. పచ్చగా ఏపుగా పెరుగుతున్న వరి పైరుకు అగ్గితెగులు సోకడంతో ఎర్రగా మారి కుచించుకుపోతున్నాయి. వ్యవసాయాధికారులు సూచించిన మందులను పిచికారీ చేస్తున్నా ప్రయోజనం కలగడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాధికారులు స్పందించి సత్వరమే అగ్గితెగులు నివారణకు రైతులకు సరైన సూచనలు ఇవ్వాల్సి ఉంది.

నిర్లక్ష్యం వహిస్తే నష్టం తప్పదు

వరికి సోకే అగ్గితెగుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే నష్టం తప్పదు. రైతులు సరైన అవగాహణతో సస్యరక్షణ చర్యలు చేపడితే దీనిని సులువుగానే అదుపు చేయవచ్చు. వరిలో అగ్గి తెగులును నివారించేందుకు ఎకరాకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్(బీంపాడి) అనే మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. అలాగే 2 మిల్లీలీటర్ల కాసుగామైసిల్ అనే మందును లీటరు నీటితో కలిపి పైరుపై పిచికారి చేసినా ఈ అగ్గి తెగులను నియంత్రించవచ్చు. అలాగే నత్రజని ఎరువుల మోతాదును తగ్గించి, పొటాష్‌ను అధికంగా వాడినా అగ్గితెగులను అరికట్టవచ్చు.

– గీతాకుమారి, మండల వ్యవసాయాధికారి

స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమావేశం



చలపతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఏమీ ఆశించకుండా చేసేదే నిజమైన సేవ అని ఆడిటర్ చలపతి పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమావేశాన్ని జిల్లా స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనంతరం చలపతిని సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు పాండు, రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌లో సురేష్ తన అన్నా, వదినలతో కలిసి ఉంటున్నారు. నగరపాలక సంస్థలో కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న ఈయనకు గాంధీనగర్‌కు చెందిన ఆరిఫ్ స్నేహితుడు. అప్పుడప్పుడూ సురేష్ స్నేహితుడి ఇంటికెళ్లొచ్చేవారు. ఈ క్రమంలో వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. సురేష్‌పై ఆరిఫ్ అనుమానం పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో అద్దె ఇంటి విషయమై మాట్లాడేందుకు స్నేహితుడి ఇంటికి సురేష్ శుక్రవారం వెళ్లారు. ఆ సమయంలో ఆరిఫ్ లేకపోవడంతో అతని భార్యతో మాట్లాడసాగారు. ఈ క్రమంలో ఆరిఫ్ తన స్నేహితులు యశ్వంత్, అజయ్‌కుమార్‌తో ఇంటికొచ్చి సురేష్‌తో గొడవపడ్డారు. కులం పేరుతో దూషించడంతో పాటు తమ ఇంటికి రావొద్దని చెప్పినా వస్తావా అంటూ కర్రతో తలపై బలంగా కొట్టారు. అక్కడే ఉన్న కూరగాయలు తరిగే చాకుతో పొడిచారు. చేయి అడ్డుపెట్టడంతో సురేష్‌కు తీవ్రగాయమై అపస్మారక స్థితిలో పడిపోయారు. యశ్వంత్, అజయ్ తమ స్నేహితుడ్ని అడ్డుకొని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో సురేష్‌ను చేర్పించారు. ఈ మేరకు బాధితుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్, హత్యాయత్నం కింద కేసును నమోదు చేశారు.